క్లుప్తంగా

తెగుళ్ల నివారణకు ఆధునిక పద్ధతులు పాటించాలి



వరి పంటలో తెగుళ్ల నివారణ పద్ధతులను వివరిస్తున్న వ్యవసాయాధికారులు

చీమకుర్తి రూరల్: మండలంలోని మంచికల పాడు, పడమటి నాయుడుపాలెం గ్రామాల సచివాలయాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ ఆయా గ్రామాల్లోని పొలాలను సందర్శించి వరి పంటను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు ఆధునిక పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు, పేర్నమిట్ట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్‌బాబు పాల్గొని రైతులతో మాట్లాడారు. ఈ–పంట నమోదుకు సంబంధించిన ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. సూపర్ చెక్ తనిఖీ నిమిత్తం పొగాకు పంటలో ఈపంట నమోదు చేసిన రైతుల వివరాలను తనిఖీ చేశారు. సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పి.పావని, ఉద్యానవన శాఖాధికారిణి డి.ప్రత్యూష, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిని వి.వి.శేషమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కె.వి.సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు టి.చిరంజీవి, సి.జానకి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కళతప్పిన సచివాలయం

- సచివాలయాల ద్వారా అందే సేవలను తగ్గిస్తున్న కూటమి ప్రభుత్వం
- పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ప్రజల ప్రదక్షిణలు
- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్లు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 545 సేవలు అందించిన సచివాలయాలు



చిలకపాడులోని గ్రామ సచివాలయం

సంతనూతలపాడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు ఎక్కడికక్కడే మెరుగైన సేవలు అందించింది. గ్రామ స్వరాజ్య దిశగా సమూల మార్పులు చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలు, ఉద్యోగులతో పాటు వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసింది. ప్రజలు ఇంటి వద్దే ఉండి అన్ని సేవలు పొందేలా చర్యలు తీసుకుంది. అలాంటి సచివాలయాలు ప్రస్తుతం కళతప్పాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమంగా సచివాలయాల సేవలను తగ్గిస్తూ వస్తుండటంతో ప్రజలకు ఎలాంటి సేవలూ అందక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

సంతనూతలపాడు నియోజకవర్గంలో అలంకారప్రాయంగా మారిన సచివాలయాలు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామని, సూపర్‌సిక్స్, తదితర పథకాలు అమలు చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. ప్రస్తుతం సచివాలయాల సేవలకు తూట్లు పొడుస్తోంది. ఇప్పటికే సచివాలయాల్లో అనేక సేవలను నిలిపివేసింది. రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ ఓపెన్ కాలేదు. దీంతో సంతనూతలపాడు నియోజకవర్గంలోని సచివాలయాలు అలంకారప్రాయంగా మారిపోయాయి. సమస్యలపై ప్రజలు వాటిచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. అధికారంలోకి వచ్చి ఎనిమిదో నెల కావస్తున్నా ఎలాంటి పథకాలు అమలు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది కూటమి ప్రభుత్వంలోని చోటామోటా నాయకులు ఆ పథకం ఇప్పిస్తాం.. ఈ పని చేయిస్తాం అంటూ అమాయక ప్రజల వద్ద నుంచి డబ్బు కూడా వసూలు చేస్తున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సేవలు ఇలా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయాలకు అనుసంధానంగా 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ని నియమించి ఆయా కుటుంబాలకు ఎలాంటి సేవలు కావాలన్నా ఇంటి వద్దే అందించింది. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ తదితర సేవలతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ఏ కార్యాలయానికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉన్న చోటే వాటిని అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ సేవలకు తూట్లుపడ్డాయి. ఫలితంగా సచివాలయాలు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. దీంతో సచివాలయాల సేవలను గత ప్రభుత్వంలా కొనసాగించాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

పింఛన్ల కోసం ఎదురు చూపులు...

ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయలేదు. దీంతో వారు సచివాలయాల చుట్టూ తిరగడం.. ఇంకా సైట్ ఓపెన్ కాలేదని సిబ్బంది చెప్పడంతో నిరాశతో వెనుదిరగడం పరిపాటిగా మారింది. తాము అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు పంపిణీ చేస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు.

గత ప్రభుత్వంలో 545 రకాల సేవలు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయాల ద్వారా 545 రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ల ద్వారా వ్యవసాయ, ఆరోగ్య సేవలను సైతం అందించింది. ఇంటి ముంగిటే సేవలు అందడంతో సచివాలయాలకు ప్రజల నుంచి ఆదరణ లభించింది.

పింఛన్ల పంపిణీకే పరిమితం...

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నేతలు సచివాలయ ఉద్యోగులపై అనేక విమర్శలు చేశారు. అవహేళనగా మాట్లాడారు. కానీ నేడు అధికారంలోకి వచ్చాక పింఛన్ల పంపిణీకి సచివాలయ ఉద్యోగులే వారికి దిక్కయ్యారు. అయితే, కేవలం పింఛన్ల పంపిణీకే సచివాలయ ఉద్యోగులను పరిమితం చేయడం, సర్వేల పేరుతో వారిపై ఒత్తిడి పెంచుతుండటంతో ఇతర సేవలేమీ అందక ప్రజలు అవస్థపడుతున్నారు.

వైభవంగా తెప్పోత్సవం



మదనూరులో రామలింగేశ్వరస్వామి ఆలయం ఎదురుగా కోనేరులో తెప్పోత్సవం

మదనూరు (కొత్తపట్నం): మదనూరులో తెప్పోత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఎండోమెంట్ ఇన్‌చార్జి ఈవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ముందుగా కోనేరులో బోర్లతో నీరు నింపి కోనేరు చుట్టూ విద్యుత్ లైట్లతో అలంకరించారు. కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామివార్లను ఈతముక్కల గ్రామం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా మదనూరు రామలింగస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. ఎదురుగా ఉన్న కోనేరు ఒడ్డున ఉంచారు. కోనేరులో సిద్ధం చేసిన తెప్పలో రామలింగేశ్వరస్వామి, కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామిని ఉంచారు. తెప్పలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తమల పాకులపై కర్పూరం వెలిగించి కోనేరులో వదిలారు. రామలింగేశ్వరస్వామి, కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామికి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం కన్నేశ్వరస్వామి, కోదండరామస్వామికి ఈతముక్కలలో గ్రామోత్సవం నిర్వహించారు. మదనూరులో రామలింగేశ్వరస్వామిని ఊరేగించారు. కోనేరులో నిర్వహించిన తెప్పోత్సవంలో భక్తులు కోనేరు చుట్టూ తిరిగి తిలకించారు. వచ్చిన భక్తులు కోనేరు ముందు టెంకాయలు కొట్టి తమలపాకులపై కర్పూరం వెలిగించి కోనేరు వదిలి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఆనవాయితీ ప్రకారం బ్రహ్మోత్సవాలకు ముందుగా అమావాస్య రోజున తెప్పోత్సవం జరపాల్సి ఉందన్నారు. అందులో భాగంగా తెప్పోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి కూలీల శాతం పెంచాలి



ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

కొత్తపట్నం: ఉపాధి కూలీల శాతం పెంచాలని డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఉపాధి కూలీల పనులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలు ఇంత తక్కువగా ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. మండలంలో రోజుకు రెండు వేల మంది చేయాల్సింది కేవలం 150 మందితో చేయడం మంచిది కాదంటూ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇప్పటికే అన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభించాలని, ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని వివరాలడిగి తెలుసుకున్నారు. నా పరిశీలనలో మండలంలో చాలా పనులున్నాయని, వెంటాడి పనులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, ఏపీవో రత్నజ్యోత్స్న, జేఈ చంద్రశేఖర్, టీఏలు అచ్చుబాబు, సుమన్, మాధవరావు, మేటు శ్యామ్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పెళ్లూరులో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిణి బేబీరాణి



మంగమూరులో జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారులు

- జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిణి డాక్టర్ కె.బేబీరాణి

ఒంగోలు సిటీ: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి డాక్టరు బేబీరాణి సూచించారు. బుధవారం ఒంగోలు మండల పరిధిలోని పెళ్లూరు గ్రామంలో ఆచార్య ఎన్.జి. రంగా సర్వీసు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబీరాణి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాధారణ వైద్య సేవలు, గర్భకోశ వ్యాధుల నిర్ధారణ, చికిత్స, చూడి పరీక్షలు, గొంతువాపు వ్యాధి నిరోధక టీకాలు, గేదెలు, ఆవులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు. గొర్రెలలో బొబ్బవ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మొత్తం 87 మంది పాడిరైతులు లబ్ధిపొందారని తెలిపారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంఘ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖరరావు, ఒంగోలు డివిజనల్ ఉపసంచాలకులు డాక్టరు రమేష్‌బాబు, జిల్లా సమీకృత గొర్రెల అభివృద్ధి కేంద్ర సహాయ సంచాలకులు వెంకటరెడ్డి, ఆచార్య ఎన్‌జీ రంగా సర్వీసు ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు నామినేని మోహన్‌రావు, ఎస్.చంద్రశేఖరరావు, చుంచు శేషయ్య, ఎం.రంగారావు, ఎం.శ్రీనివాసరావు, జి.కోటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, డాక్టరు జగత్ శ్రీనివాసరావు, ఏడీ డాక్టరు బి.బసవశంకరరావు, ఒంగోలు, కొత్తపట్నం పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంగమూరులో మెగా పశువైద్య శిబిరం...

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరు గ్రామంలో బుధవారం జరిగిన మెగా పశు వైద్య శిబిరంలో పశువైద్యాధికారి డాక్టర్ పి.చిరంజీవితో కూడిన పశు వైద్యం బృందం పాల్గొని సేవలందించింది. 3102 గొర్రెలు, మేకలు, గేదెలు, దూడలకు, చికిత్సలు చేసి నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. పశు వైద్య సహాయకులు వంశీకృష్ణ, శైలజ, చరణ్ కుమార్, పోషకులు పాల్గొన్నారు.

పశువులకు సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం...

చీమకుర్తి రూరల్: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు మనురూప్ సూచించారు. బుధవారం మండలంలోని గోనుగుంట సచివాలయం పరిధిలోని మువ్వావారిపాలెం గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. పల్లామల్లి వైద్యాధికారి టి.మనురూప్ 1500 గొర్రెలు, మేకలు, 15 ఆవులు, 13 దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. 7 గర్భ నిర్ధారణ, 3 గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసినట్లు చెప్పారు. నేడు కేవీ పాలెంలో ఆరోగ్య శిబిరం నిర్వహిస్తామని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో...

నాగులుప్పలపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశు ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని నాగులుప్పలపాడు పశువైద్యశాల ఏడీ డాక్టరు ఎస్.నాగభూషణం సూచించారు. బుధవారం మండలంలోని ఉప్పుగుండూరులో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ, పశుగ్రాసాల సాగు, పశు బీమా పథకం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా జనవరి 20 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 150 పశువులకు గర్భకోశ వ్యాధులు, చూడి పరీక్షలు నిర్వహించారు. 5 వేల గొర్రెలు, 150 పశువులు, 50 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. అదేవిధంగా చేకూరపాడు, దాసరివారిపాలెం తదితర గ్రామాల్లో ఆయా ఆస్పత్రుల పరిధిలోని డాక్టర్లు ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నట్టల నివారణ మందు తాగించారు. కార్యక్రమంలో డాక్టర్లు జాస్మిన్, లావణ్య, వెంకట సురేఖ, అనురాధ, వివిధ గ్రామాల పశువైద్యశాలల సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్లు



దూడలకు వైద్యం చేస్తున్న పల్లామల్లి పశువైద్యాధికారి మనురూప్

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల

అధ్యక్షుల నియామకం

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల సంతనూతలపాడు నియోజకవర్గ అధ్యక్షులను పార్టీ కేంద్ర కమిటీ బుధవారం నియమించింది. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధ్యక్షులను నియమించారు. వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

అనుబంధ విభాగం	నూతన అధ్యక్షుడు
యూత్ విభాగం	కందుల దానియేల్
మహిళా విభాగం	నారా విజయలక్ష్మి
రైతు విభాగం	అబ్బూరి శంకరరావు
బీసీ సెల్	మూరబోయిన సంజీవరావు
ఎస్సీ సెల్	తేళ్ల పుల్లారావు
ఎస్టీ సెల్	దేవరకొండ తాతారావు
మైనారిటీ సెల్	ఎస్కే ఖాజా
క్రిస్టియన్ మైనారిటీ సెల్	తేళ్ల సుబ్బారావు
విద్యార్థి విభాగం	ఈరేపల్లి శివసుబ్రహ్మణ్యం
పంచాయతీరాజ్ విభాగం	బొమ్మల రామాంజనేయులు
మున్సిపల్ విభాగం	కంజుల ప్రతాప్‌రెడ్డి
ఆర్టీఐ విభాగం	మారెడ్డి చెంచురెడ్డి
వలంటీర్స్ విభాగం	ఉన్నం ఆంజనేయులు
గ్రీవెన్స్ సెల్	దమ్మాల శ్రీనివాసరావు
వాణిజ్య విభాగం	కొణిజేటి సురేష్
వీవర్స్ విభాగం	గుంటి సుబ్బారావు
వైఎస్సార్ టీయూసీ	కొత్తపల్లి వెంకట సుబ్బయ్య
అంగన్‌వాడీ విభాగం	కామేపల్లి హరిత
లీగల్ సెల్	గంగవరపు మార్క్‌బాబు
కల్చరల్ విభాగం	మక్కెన రాజేంద్ర
సోషల్ మీడియా విభాగం	ఎం.ఝాన్సీరాణి
ఐటీ విభాగం	గోరంట్ల వెంకట్రావు
దివ్యాంగుల విభాగం	బొమ్మల కోటయ్య
డాక్టర్స్ విభాగం	పీ వెంకట సుబ్బారావు
ఇంటెలెక్చువల్స్ ఫోరం	డాక్టర్ వై.చిట్టిబాబు
బూత్‌కమిటీల విభాగం	బొడ్డు కోటేశ్వరరావు
పబ్లిసిటీ విభాగం	బత్తుల ప్రసన్న కుమార్

సీనియర్ అడ్వకేట్‌కు ఘన నివాళి

ఒంగోలు: ప్రముఖ సీనియర్ అడ్వకేట్ ఉప్పలపాటి లక్ష్మీనారాయణకు న్యాయమూర్తులు, న్యాయవాదులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి, జిల్లా న్యాయమూర్తులు డి.అమ్మన్నరాజా, టి.రాజా వెంకటాద్రి, పి.లలిత, డి.రాములు, సీనియర్ సివిల్ న్యాయవాదులు జి.దీన, ఎస్.హేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, జూనియర్ న్యాయమూర్తులతో పాటు ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్, మాజీ అధ్యక్షులు, ఇతర న్యాయవాదులు పాల్గొని అడ్వకేట్ ఉప్పలపాటి లక్ష్మీనారాయణ సేవలను ప్రశంసించారు.

శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం

ఒంగోలు మెట్రో: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ఒంగోలు కొండ మీద వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నాద నీరాజనం. చతుర్వేద పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణ జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పనిదినాలు పూర్తి చేయకపోతే ఇళ్లకు వెళ్లిపోండి

- డ్వామా పీడీ జోసఫ్ కుమార్



మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్ కుమార్, ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు: ఉపాధి హామీ పథకంలో కూలీలకు టార్గెట్ ప్రకారం పని దినాలు కల్పించలేకపోతే సిబ్బంది ఇంటికి వెళ్లిపోవచ్చని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ మండిపడ్డారు. బుధవారం మద్దిపాడులో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మండలంలో పని దినాలు తక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో కేవలం 360 పని దినాలు మాత్రమే నడుస్తుండటంతో కనీసం వెయ్యి పని దినాలను గురువారం నుంచి కల్పించాలన్నారు. వారం తర్వాత 2000 పనిదినాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఒక్కొక్కరు 2000 పని దినాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. కానీ, మద్దిపాడులో ఆ విధంగా లేనందున టెక్నికల్ అసిస్టెంట్లు బదిలీపై పశ్చిమ ప్రాంతానికి వెళ్లి అక్కడ పనులు చేయించాలన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు కూడా సవ్యంగా పనిచేయాలని, లేకుంటే ఒకరిని మద్దిపాడు నుంచి బదిలీ చేస్తామని హెచ్చరించారు. టెక్నికల్ సమస్యలు పరిష్కరించుకోకుండా పనులు పెండింగ్ పెడితే పని దినాలు కల్పించలేమన్నారు. ఈ విషయంలో కంప్యూటర్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జ్యోతి, ఏపీడీ వెంకటస్వామి, ఏపీవో ధనంజయ, టెక్నికల్ ఇంజినీర్ కిషోర్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొత్తపట్నం హైస్కూల్లో సామాజిక తనిఖీ



పాఠశాలలో మౌలిక వసతుల గురించి చర్చిస్తున్న సామాజిక తనిఖీ బృందం

కొత్తపట్నం: సమగ్ర శిక్ష సీఎం పోర్టల్ సామాజిక తనిఖీలో భాగంగా స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు సొసైటీ సోషల్ ఆడిట్ అకౌంటబిలిటీ ట్రాన్స్‌పరెన్సీలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 20 మంది డీఆర్పీలు 76 పాఠశాలలకు తనిఖీ నిమిత్తం రావడం జరిగిందన్నారు. అందులో కొత్తపట్నం మండలానికి నలుగురు డీఆర్పీలు సామాజిక తనిఖీల్లో పాల్గొనడం జరిగిందన్నారు. స్టాక్ రైస్, కోడిగుడ్లు, చిక్కీల రిజిస్టర్లు సక్రమంగా ఉన్నట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, పాఠశాలలో రన్నింగ్ వాటర్ మౌలిక సదుపాయాలను గుర్తించారు. మినరల్ వాటర్ అందడం లేదని, డైనింగ్‌హాల్ లేదని, విద్యార్థులకు సరపడా ప్లే మెటీరియల్ లేదని, అదనంగా గ్రౌండ్ అవసరమని, మూడు నుంచి ఐదు తరగతుల వరకు విద్యార్థులు బెంచీలు లేక కింద కూర్చోవడాన్ని పరిశీలించారు. ఈ నివేదికను ఎస్ఎస్ఏటీ కార్యాలయానికి అందజేస్తామన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు కావాల్సిన వాటిపై సమావేశంలో చర్చించారు. సామాజికి తనిఖీలో డీఆర్పీలు కేసీ సుబ్బారాయుడు, వి.సూర్యప్రకాష్, హెచ్ఎం శ్రీదేవి, ఎస్ఎంసీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు చేయూత



విద్యా సామగ్రి అందజేస్తున్న దాతలు

చీమకుర్తి రూరల్: మండలంలోని బండ్లమూడి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం విద్యా సామగ్రి అందజేశారు. శిద్దా సుధాకర్, జయభారతి, లక్ష్మి వారి తండ్రి శిద్దా వెంకట సుబ్బారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. హెచ్ఎం కాంతారావు, వద్ది శ్రీనివాసరావు, చలవాది వెంకట శివప్రసాద్, ఆలపాటి శ్రీనివాసరావు, మద్ది వెంకట్రావు, దామోదర్‌రావు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండలం ఎండ్లూరు సచివాలయం పరిధిలో బుధవారం పలు సర్వేలను ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించి వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. సచివాలయ సిబ్బందితో వివిధ సర్వేల ప్రోగ్రెస్‌పై ఆయన సమీక్షించారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, పీఏసీఎస్, గ్రామాల్లో నివాసాలకు సంబంధించి ఆయా ప్రజల సర్వేలపై ఎంపీడీవో ప్రత్యేకంగా సమీక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వీఆర్వో ఆదిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5న 108 గోవులకు పూజ

ఒంగోలు మెట్రో: రథసప్తమి పండుగ సందర్భంగా ఫిబ్రవరి 5వ తేదీ ఒంగోలు వీవీఎం మంగమ్మ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అష్టోత్తర శత గోపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు విశ్వమాత సోషల్ సర్వీస్ సొసైటీ వివేకానంద చారిటబుల్ ట్రస్ట్, గౌతమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. గోమాత సంరక్షణ, సనాతన ధర్మ సంరక్షణ బహిరంగ సభ ప్రముఖ వేద పండితుల ఆధ్వర్యంలో 108 మంది మహిళా భక్తులచే 108 గోవులకు పూజోత్సవం, యజ్ఞం నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మంగమ్మ కాలేజీ ప్రిన్సిపాల్ రంగారావు, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ కార్యనిర్వాహకులు వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ, నర్సింహులు, గౌతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు రంగారావు, ధనరాజు, విశ్వమాత సోషల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి హోమంలో పాల్గొన్న మహిళా భక్తులు

భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మకు పూజలు

ఒంగోలు మెట్రో: పుష్యమాసంముని అమావాస్య సందర్భంగా బుధవారం అమ్మవారి ఆలయాలలో అభిషేకాలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్ల మూలవిరాట్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో చక్కగా అలంకరణ గావించారు. అష్టోత్తర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి సన్నిధిలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు